# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 148 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

11-04-2026 శనివారం వెల : 1 /- పేజీలు : 4


# నేరడి గెజిట్‌తో సిక్కోలు అభివృద్ధికి నాంది

- నేరడి నోటిఫికేషన్ చారిత్రాత్మకం
- రైల్వే, మౌలిక వసతులపై కీలక నిర్ణయాలు
- భోగాపురం ప్రారంభానికి సన్నాహాలు
- అభివృద్ధిపై కేంద్ర మంత్రి వ్యాఖ్యలు

**నవతరం -శ్రీకాకుళం**

సిక్కోలు అభివృద్ధి చరిత్రలో నిలిచేలా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నేరడి గెజిట్ నోటిఫికేషన్ దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు.

రైల్వే రంగంలోనూ పురోగతి సాధించామని, కొత్త రైలు సర్వీసులు, మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతుందని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు వేగంగా జరుగుతున్నాయని, జులై 5న ప్రారంభానికి



ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి కొత్త పనులను ప్రారంభించడం ప్రభుత్వ లక్ష్యమని, ప్రాంతీయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# మతి స్థిమితం లేని మంత్రి వ్యాఖ్యలు

- సంచలన వ్యాఖ్యలు చేసిన మాజీ స్పీకర్ తమ్మినేని...
- అచ్చెన్నాయుడూ.. నోరు అదుపులో పెట్టుకో
- వైఎస్సార్ మరణంపై నీ వ్యాఖ్యలు నీచాతి నీచం
- మీడియా సమావేశంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

2లో



## రూ. 19.68 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులపై

# కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష



- 316 పనులకు గాను 150 పూర్తి.. మిగిలినవి సత్వరమే పూర్తి చేయాలని ఆదేశం

**నవతరం -శ్రీకాకుళం**

ప్రజల అవసరాల కోసం కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులు ప్రతి పైసా సద్వినియోగం కావాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 17, 18వ లోక్‌సభ ఎంపీ లాడ్స్ నిధుల సమీక్షలో ఆయన

-మిగతా 2లో

# విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను సిద్ధం చేసుకోవాలి

**నవతరం -శ్రీకాకుళం**

నిరుద్యోగ యువత విద్యార్థి దశ నుంచే భవిష్యత్తు కోసం ప్రణాళికల్ని, లక్ష్యాలను సిద్ధం చేసుకోవాలి తద్వారా వారు విద్యను పూర్తి చేసేసరికి ఉద్యోగ అవకాశాన్ని పొందగలరు అని జిల్లా ఉపాధి కల్పన అధికారి కే.సుధా అన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల శ్రీకాకుళం లో శుక్రవారం హర్షవల్లి లైన్స్ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన సదస్సులో పాల్గొని ఆమె మాట్లాడారు.

ప్రభుత్వపరంగా ఎంప్లాయిమెంట్ మరియు ఎన్సీఎస్ లు నిరుద్యోగ పోర్టర్లు అందుబాటులో ఉన్నాయని యువత వాటిలో వారి పేర్లను నమోదు చేసుకోవాలని , జిల్లాకు సంబంధించిన వేలాది మంది యువత ఇప్పటికీ వారి పేర్లను నమోదు చేసుకున్నారని

-మిగతా 2లో




# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- కార్యకర్తల సమావేశంలో పిలుపు
- సమన్వయంతో పనిచేయాలన్న నేతలు
- క్లస్టర్ స్థాయిలో వ్యూహాల చర్చ
- పలువురు నాయకుల పాల్గొనడం

**నవతరం -పలాస**


రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సంపూర్ణ విజయాన్ని సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం క్లస్టర్-4 కన్వీనర్ మురిపింటి కుమార్ రాజా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

గెలుపే ఏకైక లక్ష్యంగా సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రతి స్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సంతోషిమాతకు వైభవంగా పుష్పయాగం

- శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహణ
- భారీగా తరలివచ్చిన భక్తులు
- వేద మంత్రోచ్చారణల మధ్య మహా హారతి
- ప్రముఖుల దర్శనం



**నవతరం -శ్రీకాకుళం**

పాత శ్రీకాకుళంలోని శ్రీ సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు క్షీరాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణం, వేద పారాయణంతో ఘనంగా సాగాయి.

మహా నివేదన, నీరాజనం, మహా హారతులతో ప్రత్యేక పూజలు ముగిశాయి. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మోదుకూరి కిరణ్ శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించగా, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సేవల్లో పాల్గొన్నారు.

# జేఎన్టీయూలో ఆచార్య బలివాడ లీలాకుమారికి ఘన సన్మానం



- వైస్ ఛాన్సలర్, జిల్లా కలెక్టర్ తదితర ప్రముఖుల హాజరు
- ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ప్రొ. బలివాడ లీలాకుమారి
- పలువురి అభినందన

**నవతరం -శ్రీకాకుళం**

కాకినాడ: జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ), కాకినాడలో విశ్వవిద్యాలయ వార్షిక వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయురాలు (ఉన్నత విద్య) గా ఎంపికైన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగాధిపతి ప్రొఫెసర్ బలివాడ లీలాకుమారిని ఘనంగా సత్కరించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ లు శాలువ, ప్రశంసా పత్రం, జ్ఞాపకలతో సత్కరించారు. లీలా కుమారి విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి, విద్యావేత్త బలివాడ మల్లేశ్వరరావు కుమార్తె కావడం విశేషం. యూనివర్సిటీ ఈసీఈ విభాగానికి లీలాకుమారి అందిస్తున్న సేవలను యూనివర్సిటీ ప్రొఫెసర్లు, విభాగాధిపతులు ప్రశంసించారు. ప్రొఫెసర్ లీలా కుమారిని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు, బలివాడ మల్లేశ్వరరావు, కేంద్ర ఆర్థికశాఖ హిందీ సలహా మండలి సభ్యులు కోనే శ్రీధర్, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు తదితరులు శుక్రవారం అభినందించారు.

ఎడిటోరియల్

# ఫీజు విద్యార్థులే కట్టాలా?

తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయమై విద్యాసంస్థల యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8514 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించినప్పటికీ, హైకోర్టు మాత్రం ఆ మొత్తాన్ని విద్యార్థుల నుంచే వసూలు చేసుకోవచ్చని తీర్పునిచ్చింది. ఈ తీర్పు భారత రాజ్యాంగం కల్పించిన విద్యా ప్రాథమిక హక్కుకు విరుద్ధంగా ఉందని భావించాల్సి వస్తోంది.దేశంలో ప్రతి పౌరునికి విద్య అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. అయితే విద్యార్థుల సంఖ్యకు సరిపోయే విధంగా విద్యా సంస్థలను ఏర్పాటు చేయకుండా, "స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్‌లు ఇస్తాము, మీకు నచ్చిన కాలేజీలో చదువుకోండి" అనే విధానాన్ని అమలు చేస్తూ, ఫీజులు వేలల్లో పేరుకుపోయిన తర్వాత చెల్లింపులు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు న్యాయం కోరితే వారిపై అక్రమ కేసులు పెట్టడం జరుగుతోంది. విద్యాసంస్థల యాజమాన్యాన్ని కూడా ఒత్తిడులకు గురిచేస్తున్నారు.

ప్రభుత్వం అన్యాయం చేస్తోందని కోర్టును ఆశ్రయించినప్పుడు, ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నించి, సరైన మార్గనిర్దేశం చేయాల్సిన కోర్టు, విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేసుకోవాలని చెప్పడం పేద విద్యార్థులను ఉన్నతవిద్యకు దూరం చేసే చర్యగా మారింది. రాష్ట్రంలో విద్యారంగానికి సంబంధించిన అనేక బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన నిధులు విడుదల కాలేదు. గత తొమ్మిది నెలలుగా మెస్ సరఫరాలు చేస్తున్న కాంట్రాక్టర్లకు కూడా బకాయిలు చెల్లించలేదు. ఈ పరిస్థితిలో వారు కోర్టును ఆశ్రయిస్తే, "విద్యార్థులకే మీరు భోజనం పెట్టారు కాబట్టి వారి నుంచే వసూలు చేసుకోండి" అనే పరిస్థితి వస్తే అది ఎంత అన్యాయమో స్పష్టమవుతుంది. ఈ అంశంపై దేశవ్యాప్తంగా గతంలో వచ్చిన పలు తీర్పులు విద్య హక్కును బలపరిచాయి."మోహిని జైన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్నాటక" కేసులో విద్య హక్కు ప్రాథమిక హక్కులతో అనుసంధానమై ఉందని పేర్కొన్నారు. "ఉన్నికృష్ణన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" కేసులో విద్య హక్కు రాజ్యాంగ పరిరక్షణలో భాగమని స్పష్టం చేశారు. "మోడ్రన్ డెంటల్ కాలేజ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్" కేసులో విద్య వాణిజ్య వస్తువుగా మారకూడదని, విద్యార్థులపై అధిక ఆర్థిక భారం మోపడం అనుచితమని అభిప్రాయపడ్డారు. ఈ తీర్పుల నేపథ్యంలో పేద విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. అందువల్ల హైకోర్టు తీర్పును తక్షణమే పున:సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న రూ.8514 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి.

అలాగే ప్రయివేటు కళాశాలలు సర్టిఫికేట్లు ఇవ్వకుండా చేస్తున్న బలవంతపు వసూళ్లను అరికట్టాలి.

విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడులు లేకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వారి భవిష్యత్తును రక్షించాలి.

# శ్రీకాకుళం జిల్లా వెనుకబడిన జిల్లా అనే కంటే డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆపర్చ్యునిటీ జిల్లా అనాలి



**నవతరం -శ్రీకాకుళం**

కార్పొరేట్ సంస్థలు నిధులు వినియోగించాలంటే జిల్లాలో డిపిఆర్ లు తయారు చేసి సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద కార్పొరేట్ సామాజిక బాధ్యత సమ్మిట్ టినీ లూప్ లో భాగంగా కొత్త రోడ్డు వద్ద గల కన్వెన్షన్ సెంటర్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎస్ఆర్, కార్పొరేట్, ఎన్జీఓ లు పాల్గొన్నట్లు చెప్పారు.

సిఎస్ఆర్ సమ్మిట్ ను విజయవంతం చేసేందుకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి విచ్చేసిన టీంలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాప్రతినిధులు, అడ్మినిస్ట్రేషన్, ఎన్జీఓ, సిఎస్ఆర్ నాలుగు డిపార్ట్మెంట్ లు కలిసి ఒక శక్తి వంతమైన ప్లాట్ఫారంను నిర్మించుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఇందులో ఒక పరిపూర్ణమైన లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం జరగడానికి ముఖ్య కారకులు శాసన సభ్యులు కూన రవి కుమార్ అన్నేనన్నారు. ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన జిల్లాలో సమ్మిట్ ఏర్పాటుకు అందరితోనూ చర్చించినట్లు పేర్కొన్నారు. సిఎస్ఆర్ వినియోగంలో ప్రపంచంలో భారత్ మొదటి స్థానంలో ఉంటుందన్నారు. భారత దేశం సాంస్కృతిక మూలాలు చూసుకుంటే మన సంపాదనలో సమాజానికి ఎంత ఇవ్వగం అనే దానిని నిర్ణయించుకోవాలన్నారు. దేశంలో పెద్ద పెద్ద కంపెనీలు పెరగడం వలన కంట్రిబ్యూషన్ కూడా పెరిగిందన్నారు. ఏదైనా ప్రాంతంలో పరిశ్రమ పెట్టాలంటే ప్రజాభిప్రాయ సేకరణ చేసిన తరువాత పరిశ్రమ ఏర్పాటు చేసి దాని నుండి వచ్చిన కంట్రిబ్యూషన్ ఆ ప్రాంతం అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. సిఎస్ఆర్ పెట్టిన తర్వాత 2014లో ప్రధాని నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత మరింత ఫండ్స్ వచ్చేటట్లు చేసి ఎన్నో సేవలు చేసినట్లు చెప్పారు. సిఎస్ఆర్ ఏక్టివిటీ చారిటీకే కాదని, అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడుతోందన్నారు.

సిఎస్ఆర్ ఏక్టివిటీ శ్రీకాకుళంలో పెద్ద ఎత్తున చేయవచ్చన్నారు. శ్రీకాకుళం జిల్లా వెనుకబడిన, పేదరికం జిల్లా అని అనుకుంటూ ఉంటామని అలా అనేకంటే జిల్లాని డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆపర్చ్యునిటీ జిల్లా అంటే బాగుంటుందన్నారు. ఎదుగుతున్న జిల్లా అని జిల్లా పై పిల్లల్లో ఒక కాన్ఫిడెన్స్ కలుగుతోందన్నారు. సిఎస్ఆర్ ఏక్టివిటీ లో పెద్ద పెద్ద కంపెనీలకు ఫండ్స్ అయితే ఉన్నాయి కానీ ఏ విధంగా చేస్తే బాగుంటుంది అనే అవగాహన లేనందు వలన వారు ఏమి చేయలేకపోతున్నారన్నారు. కింద స్థాయి నుండి ఎవరైతే ఉన్నారో వారితో ప్రోగ్రాం ఫిక్స్ చేయించి అభివృద్ధి చేయొచ్చన్నారు. కార్పొరేట్ నుండి నిధులు వచ్చిన రాకపోయిన ఎన్జీఓ లు సర్వీసు చేసి వారి యొక్క జీవితాలను అంకితం చేశారన్నారు. ఈ సందర్భంగా ఎన్జీఓలను ఆయన అభినందిస్తున్నట్లు చెప్పారు. 49 సంవత్సరాల నుండి జిల్లాలో ఎన్జీఓ నడుపుతున్నట్లు తెలిపారు. ఎన్జీఓ లకు ఒక ప్లాట్ ఫారం ఏర్పాటు చేయాలన్నారు.

హెల్త్, ఎడ్యుకేషన్, నైపుణ్యాభివృద్ధి, కోస్టల్ ఏక్టివిటీ, ప్రకృతి ఉంది వాటిని కాపాడుకోవాలన్నారు. సిఎస్ఆర్ ఏక్టివిటీ ద్వారా అన్ని ప్రాంతాలను కలుపుకుని పోవాలని చెప్పారు.

# విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను సిద్ధం చేసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

తెలియజేశారు.. శ్రీకాకుళం జిల్లాలో నిర్మితమవుతున్న మూలపేట పోర్ట్ భోగాపురం విమానాశ్రయం లలో యువతకు ఉద్యోగ మరియు ఉపాధి కల్పనలకు అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆమె అన్నారు..

విద్యార్థి దశలో క్రమశిక్షణ లోపిస్తే భవిష్యత్తు అంధకార బందురం అవుతుందని తమ జీవితాల్లో వెలుగులు నింపేందుకు కష్టించి చదవటం, క్రమశిక్షణను పాటించడం, నైతిక ప్రవర్తన కలిగి ఉండడం అవసరమని తమ డిగ్రీ కళాశాల విద్యార్థులలో వాటిని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తూ ఉన్నాము అని కెప్టెన్ డాక్టర్ ఏళ్ళ పోలినాయుడు ప్రిన్సిపల్ డిగ్రీ కళాశాల శ్రీకాకుళం అన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో పర్యాటకం దినదినము అభివృద్ధి చెందుతుందని రాష్ట్రంలో ప్రస్తుతం ఈ అభివృద్ధి రెండవ స్థానంలో నిలబడిందని పర్యాటకం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చని ఆ దిశలో ఏ నిరుద్యోగికైనా సలహాలు సూచనలు అవసరమైతే తమని సంప్రదించవచ్చని నడిమింటి నారాయణరావు జిల్లా పర్యాటక శాఖ అధికారి శ్రీకాకుళం అన్నారు.

సదస్సుకు స్వాగతం పలుకుతూ హర్షవల్లి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్ష పూర్వ అధ్యక్షులు లైన్ కరణం హారిక ప్రసాద్, లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ముఖ్యంగా పట్టణంలో హర్షవల్లి లయన్స్ తో ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలను చేపడుతూ ఉన్నామని లయన్స్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు యువతలో చైతన్యాన్ని తీసుకువచ్చి వారికి ఉపాధి ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం యొక్క పాత్రని తెలియచెప్పేందుకు డిగ్రీ కళాశాలలో ఈరోజు ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి రవిశంకర్ కెరీర్ గార్డెన్స్ కన్వీనర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వందన సమర్పణ చేస్తూ తమ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు హర్షవల్లి లైన్స్ క్లబ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

హర్ష వల్లి లైన్స్ క్లబ్ డైరెక్టర్ శ్రీమతి మణిశర్మ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో తర్లాడ అప్పలనాయుడు ఉపాధ్యక్షుడు, పాలిసెట్టి మధుబాబు డైరెక్టర్ పూర్వ కార్యదర్శి రైతు శ్రీనివాసరావు లయన్ మజ్జి సుమన్ లయన్ పాలిసెట్టి మధుబాబు మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎగ్జామినేషన్ డీన్ , అధ్యాపకులు పాల్గొన్నారు...

# మతి స్థిమితం లేని మంత్రి వాఖ్యలు

**నవతరం -ఆమదాలవలస**

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మరణంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యల పట్ల మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆమదాలవలస తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ఉనికి కోసం చనిపోయిన వ్యక్తిపై బురద చల్లడం అచ్చెన్నాయుడి దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు.వైఎస్సార్ మరణించిన సమయంలో జగన్మోహన్ రెడ్డి విదేశాల్లో ఉన్నారంటూ అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ, ఆనాడు తండ్రి మరణవార్త

విని కుప్పకూలిపోయిన కుటుంబానికి జగన్ అండగా ఉండి,అంత్యక్రియల వరకు అన్ని తానై చూసుకున్న విషయం ప్రపంచం మొత్తానికి తెలుసని, నీ రాజకీయ లబ్ధి కోసం ఇన్ని అబద్ధాలు ఆడతావా అని నిలదీశారు.మంత్రి అచ్చెన్నాయుడి విమర్శలకు కౌంటర్ ఇస్తూ,గార మండలం సింగపురం దగ్గర ఎర్రన్నాయుడుపై జరిగిన బాంబ్ బ్లాస్ట్ ఘటనలో నీ హస్తం లేదని చెప్పగలవా అంటూ సంచలన ప్రశ్నలు సంధించారు.

విశాఖపట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో రణస్థలం మండలం వద్ద ఎర్రంనాయుడు వాహన ప్రమాదంలో మృతి చెందిన ఘటనలో నీ హస్తం లేదని చెప్పగలవా అంటూ తమ్మినేని ప్రశ్నించారు.వైఎస్సార్ పాదయాత్ర ద్వారా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని,ఆయన ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్,ఉచిత విద్యుత్ వంటి పథకాలు తరాల జీవితాలను మార్చాయని గుర్తు చేస్తూ,అలాంటి మహనీయుడిపై విమర్శలు చేయడం ఆకాశంపై ఉమ్మి వేయడమేనని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో 'మావిగన్' ప్లాన్-బి కి ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తోందని, అమరావతిలో జరుగుతున్న దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఆదేశాలతో అచ్చెన్నాయుడు ఇటువంటి నీచమైన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.'అమరావతి వద్దు.. మావిగన్ ముద్దు' అని ప్రజలు అంటున్నారని,ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే అచ్చెన్నాయుడు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తమ్మినేని సీతారాం ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుమ్మడి రాంబాబు బూర్జ జడ్పిటిసి బెజ్జపురం రామారావు బూర్జ ఎంపీపీ ప్రతినిధి కర్ణిన నాగేశ్వరరావు ఆముదాలవలస మాజీ జడ్పిటిసి బొడ్డేపల్లి నారాయణరావు రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రెటరీ బెండి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 19.68 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష

మొదటిపేజీ తరువాయి

పాల్గొని, నిధుల వినియోగంపై శాఖల వారీగా విశ్లేషణ చేశారు.

శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో మొత్తం రూ.సుమారు రూ. 19.68 కోట్ల అంచనా వ్యయంతో 316 పనులు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 150 పనులు పూర్తయి తుది బిల్లుల చెల్లింపు జరిగిందని మంత్రి వెల్లడించారు. పనులు పూర్తయిన వెంటనే వాటికి సంబంధించిన ఫోటోలను 'ఈ-సాక్షి' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, అప్పుడే నిధుల విడుదల వేగవంతం అవుతుందని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ శాఖల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలిస్తే.. పంచాయతీ రాజ్ శాఖలో రూ. 911.40 లక్షల వ్యయంతో చేపట్టిన 153 పనుల్లో ఇప్పటి వరకు 66 పనులు పూర్తయ్యాయి. విద్యుత్ శాఖ పరిధిలో రూ. 443.81 లక్షలతో మంజూరైన 76 పనులకు గాను 34 పనులు పూర్తి కాగా, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో 19 పనులకు గాను 10 పనులు కొలిక్కి వచ్చాయి. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో రూ. 302 లక్షలతో చేపట్టిన 50 పనుల్లో 27 పనులు, ఇతర విభాగాల్లో మంజూరైన 18 పనుల్లో 13 పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. మొత్తం మంజూరైన నిధుల్లో ఇప్పటి వరకు రూ. 800.58 లక్షల వ్యయం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్ శాఖలో ఇంకా 76 పనులు, విద్యుత్ శాఖలో 42 పనులు పెండింగ్‌లో ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా టెక్కలి, శ్రీకాకుళం డివిజన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కార్యనిర్వాహక ఇంజనీర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్, డీఆర్వో విశ్వేశ్వరరావు, సీపీఓ ప్రసన్న లక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖైదీల కుటుంబాలకు 'న్యాయ' భరోసా

## 'స్పృహ' పథకంపై అధికారులతో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సమీక్ష

**నవతరం -శ్రీకాకుళం**

నేర బాధితులతో పాటు జైలులో ఉన్న వ్యక్తులపై ఆధారపడిన కుటుంబాలకు సమగ్రమైన అండగా నిలిచేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ స్పృహ అనే నూతన పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో ప్రభుత్వ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వెనుకబడిన ప్రభావితమైన వర్గాల సామర్థ్యానికి మద్దతుగా నిలవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు.

జైలులో ఉన్న వ్యక్తుల కుటుంబాలు, నేర బాధితులకు చట్టపరమైన సలహాలతో పాటు మానసిక, విద్యా, ఆర్థిక సామాజిక మద్దతును ఈ పథకం ద్వారా అందిస్తామన్నారు. ముఖ్యంగా వారిపై ఆధారపడిన పిల్లల విద్య, కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణ, జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. సమాజంలో వారిపై ఉన్న అపవాదును తొలగించి, ఆత్మగౌరవంతో జీవించేలా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ప్రస్తుత సంక్షేమ పథకాలలోని లోపాలను గుర్తించి, బాధితులకు నేరుగా ఫలాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయ ప్రతినిధులు, జైలు అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు పాల్గొన్నారు.



# సమాచార లోపంతోనే సమస్యలు

మరో వందేళ్ల తర్వాత కూడా మనిషికి ప్రత్యామ్నాయం దొరకదు. సమాజం ముందుకు వెళ్లాలంటే మానవ సంబంధాలు చాలా ముఖ్యం. ఈ పోటీ ప్రపంచంలో మనిషి ఒంటరి అవుతున్నాడు. ఎన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ, మనిషిని ఏదో వెంటాడుతూనే ఉంది. అదే ఇతరులతో పోల్చుకోవడం.

మానవ బంధాలు దెబ్బ తినడానికి అనేక కారణాలు ఉన్నాయి. సమాచారం లోపం ఇందులో ఒకటి. ఇది భావ వ్యక్తీకరణ లోపంలో ఒక భాగం. చూడటానికి ఇవి రెండూ ఒకేలా కనిపిస్తాయి.

భావ వ్యక్తీకరణ అనేది ఒక కళ. ఇది అందరికి రాదు. ఇందులో భావొద్వేగాలు కూడా ఇమిడి ఉంటాయి. కొందరు చిరునవ్వుతోనే ఎదుటి వారిని కట్టి పడేస్తారు. భావ వ్యక్తీకరణకు మనం వాడే భాష చాలా ముఖ్యం.

పైన అనుకున్నట్లు సమాచార లోపం అనేది ఇందులో ఒక భాగం. ఇది అనేక రకాలుగా ఉంటుంది. మనం ఒక వేడుక చేసుకుంటాం. ఒక్కోసారి బాగా తెలిసిన వారిని పిలువ లేక పోతాం. ఇది సమాచార లోపం కాదు. అ పనిని వేరే వారికి అప్పగిస్తాం. అది వారు చేయక పోవచ్చు.లేదా పని ఒత్తిడిలో మర్చి పోవచ్చు.

ఒక్కోసారి మన మనసులో ఎటువంటి దురుద్దేశం ఉండకపోవచ్చు. మన అభిప్రాయాన్ని ఒక విషయం గురించి తెలిపి నప్పుడు అది వేరే వారికి ఇంకో రకంగా అర్థం అవ్వొచ్చు. అంటే చెప్పడంలోనో లేదా వారు వినడంలోనో ఏదో కొద్ది పాటి లోపం జరిగి ఉండవచ్చు.దీన్ని భావ వ్యక్తీకరణ లోపం అంటారు.

సాధారణంగా ఎదుటి వారి గొప్ప తనాన్ని గురించి చెప్పేటప్పుడు మనకు పెద్దగా నైపుణ్యాలు అవసరం ఉండదు. కానీ ఎదుటి వారి లోపాలు గురించి చెప్పేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఇటువంటి విషయాల ప్రస్తావన లేకుంటే బావుంటుంది.

ఒక్కోసారి మనం చెప్పిన విషయానికి ఇంకొకరు ఒకటో రెండో విషయాలు జోడించి చెప్తారు. లేదా చెప్పిన విషయాన్ని ఇంకో రకంగా అర్థం చేసుకుంటారు. అది చివరికి చేరే వారికి చేరే సరికి దాని పూర్తిగా మారిపోతుంది. సమాచార లోపంతోనే మనకు ఎక్కువగా సమస్యలు వస్తుంటాయి. నేను మొన్నా మధ్య తెలిసిన ఓ వ్యక్తి గురించి ఇలా అన్నాను. పాపం.. అతను చాలా మంచి వాడు. చాలా అమాయకుడు అన్నాను. రెండు రోజుల తర్వాత అ వ్యక్తి ఫోన్ చేసి నా గురించి ఏదో అన్నావట. నేను అమాయకుడిని అట.. నాకేమి తెలియదన్నావటగా..

కానీ.. నా ఉద్దేశం వేరు. చెప్పిన సమాచారాన్ని సరిగ్గా వినకుండా ఉండటం లేదా దాన్ని వేరేగా అర్థం చేసుకోవడం లేదా విన్న సమాచారానికి సొంత భాష్యం జోడించడం వంటి వల్ల ఇటువంటి సమస్యలు వస్తాయి. దీని వల్ల మానవ బంధాలు దెబ్బ తింటాయి. వాస్తవానికి ఇటువంటి సమస్యల్లో పెద్దగా ఆస్తుల గొడవలు వంటివి ఏమి ఉండవు. ఒక్కోసారి సరదా కబుర్లే కొంపలుఆర్పుతాయి.ముఖ్యంగా ప్రముఖులు ఇటువంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.

మరి ఏం చేయాలి..?

సరదాగా మాట్లాడుకోవడం మానవ నైజం. అయితే పదే పదే ఎదుటి వారి ప్రస్తావన రాకుండా ఉంటే బావుంటుంది. ఏదైనా సమాచారం ఇచ్చేటప్పుడు క్లుప్తంగా ఇవ్వాలి.సమాచారం ఎక్కువగా వున్నప్పుడు రాసి పంపితే బావుంటుంది. కొన్ని ముఖ్యమైన విషయాలు ఫోన్లో మాట్లాడ కూడదు. ప్రత్యక్షంగా కలిసి చర్చించుకుంటే మంచిది. ఆలా కుదరలేదు అనుకుంటే ఎదుటి వారికి ఖాళీ ఉండేలా చూసుకోవాలి.


ప్రతి మనిషికి ఓ పరిధి ఉంటుంది. మనకు అన్ని పనులు చేయగల సామర్థ్యం ఉన్నప్పటికీ, పని విభజన చేసుకోవాలి. లేదంటే పనిలో నాణ్యత లోపిస్తుంది. పని ఒత్తిడి పెరిగి సమాచారాన్ని సరిగ్గా అందించలేము.

ఎదుటి వారితో పోల్చుకోవడం అనవసరం. ఎవరి స్థాయి వారికి ఉంటుంది. పోలికల వల్ల అసూయ, ద్వేషం పెరుగుతుంది. కష్టం లేకుంటే ఎవరికీ ఏది తొందరగా చేతికి రాదు. చివరిగా చెప్పేది ఏమిటంటే మంచి ఉంటే మైకులో చెప్పమన్నారు. చెడు ఉంటే చెవిలో చెప్పమన్నారు. ఇది సద్విమర్శలో ఓ భాగం.



యం.రాం ప్రదీప్

## మహాత్మా...జ్యోతిరావు పూలేకు... జోహార్లు..!



అంతులేని
అజ్ఞానాంధకారంలో
దిక్కులు తెలియని లోకానికి...
దివిటీలా వెలిగిన జ్ఞానజ్యోతి మీరే...
ఓ మహాత్మా జ్యోతిరావు పూలే...!
మనువాదపు మబ్బులు
మానవత్వాన్ని మింగిన వేళ...
"విద్యా హక్కు అందరికీ" అని
వినిపించిన దివ్య వాణి మీరే...
విజృంభించిన
కోహినూర్ వజ్రం మీరే...!

శూద్రుని కన్నీటిలో
చరిత్రను చదివి...
స్త్రీల అణచివేతలో
సమాజపు పాపాన్ని కడిగి...
అక్షరాలను ఆయుధాలుగా మార్చి
ఏభైరెండు అరుణోదయ
పాఠశాలలమొక్కల్ని నాటిన
ఆది తోటమాలి ఆదిగురువులు మీరే..!

కులం కట్టెలతో
మానవత్వాన్ని
కాల్చే యుగంలో...
మూఢనమ్మకాల మృగాన్ని
ముక్కలుగా చీల్చిన
మేధస్సు మీదే మెరుపు మీరే...!

వర్ణవ్యవస్థనే
విషసర్పం పంజాలో
విలవిలలాడిన బహుజనాన్ని
విముక్తి వైపు నడిపించిన
విప్లవ వీరయోధులు మీరే...!

మీ కలం...
కత్తికన్నా పదునైంది...
మీ ఆలోచన...
అగ్నికన్నా వేడైంది
మీ పోరాటం...
ఒక సాధారణ వ్యక్తిగా కాదు
ఒక మహాశక్తి సముద్ర గర్జనైంది.!

నాటి మీ అడుగుల సవ్వడి...
ఇంకా మార్మోగుతూనే ఉంది
బస్తీల గుండెల్లో...
పల్లెల నిశ్శబ్దంలో...
అణగారిన బడుగు వర్గాల
ఆక్రోశించే ఆత్మల ఆశల్లో...!

ఓ మహాత్మా...!
మీరు చూపిన దారి
మా శ్వాసగా మారింది...
మీ ఆశయాలు
మా రక్తనాళాల్లో
ప్రవహిస్తున్నాయి...
ముకిళిత హస్తాలతో
మీ విగ్రహం ముందు
మేము చేసే ప్రతిజ్ఞ ఒక్కటే...!

మీ అడుగుల్లోనే
మా అడుగులని...
సమానత్వమే
మా మంత్రమని...
విద్యయే మా ఆయుధమని..
బహుజన రాజ్యాధికారమే
మా అంతిమ లక్ష్యమని...!

మీరు కన్న కలలు...
మా కళ్లలో నిద్రపోవని...
వాటిని నిజం చేసే వరకు
మా పోరాటం ఆగదని...!

ఓ జ్యోతిరావు పూలే...!
కాదు కాదు మీరు
ఒక వ్యక్తికి ప్రతిరూపం...
మీరొక నవయుగ
చైతన్యశక్తి స్వరూపం...
మీరు అణగారిన
వర్గాల ఆరని ఆశాదీపం...!

మీది పేరు కాదు
అది ప్రజల ధ్యాస శ్వాస...!
ఓ మహాత్మా...!
ప్రకృతిలోని పంచభూతాలు
పర్వతాలున్నంత కాలం
జీవనదులు ప్రవహిస్తున్నంత కాలం
ఆకాశంలో సూర్య చంద్రులు
నక్షత్రాలు ప్రకాశిస్తున్నంత కాలం
మీరు చిరంజీవులే
మీరు చీకట్లో వెలిగే చిరుదివ్వెలే...!

జోహార్లు ఓ మహాత్మా...! మీకు జోహార్లు
జోహార్లు ఓ జ్యోతిరావు పూలే జోహార్లు.



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# సావిత్రిబాయి పూలే ధీరవనిత


మనదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళ. మొదటి పాఠశాల స్థాపించిన, సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలే మన రాష్ట్ర ప్రభుత్వం ఈమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి ,రాష్ట్ర వ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభగల ఉత్తమ ఉపాధ్యాయినల సత్కారం ఏర్పాటు చేయదం ముదావహం.అట్టడుగు వర్గాలు మహిళలకు చదువు, సంపద వంటి సమస్త హక్కులు నిరాకరించ బడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లు, మనువాద సంప్రదాయాలను,ఆధిపత్య వర్గాలను దిక్కరించి భారతదేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848 న దేశంలో బహుజులకు మొట్టమెదటి పాఠశాల ప్రారంభించిన సంస్కర్త సావిత్రిబాయి పూలే. ఈమె భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని మరియు రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీ రావ్ పూలే భార్య, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి ఆమె అథనిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి భర్తతో 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది.

కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పితృస్వామ్యానికి వ్యతిరేకంగా శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం. పోరాటం చేయటం తను సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు.

నూతన, వ్యవస్థ కోసం, ప్రాణాన్ని సైతం ఫణంగా పెట్టి సమిష్టిగా పోరాటం చేసారు. సావిత్రి బాయి మహా రాష్ట్ర సతారా జిల్లాలో నయాగాన్ అనే గ్రామంలో 1831 జనవరి, 3,న జన్మించింది. అమెది రైతుకుటుంబం, సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. వీరి బంధువులు నిజామాబాద్ జిల్లా బోధన్ నాందేడ్ కొండల్ దాడి ప్రాంతంలో, అదిలాబాద్ చుట్టుపక్కల ఉన్నారు.

సావిత్రి తన 9వ యేట 12 యేండ్ల జ్యోతిరావు పూలెను 1840లో వివాహమాడారు. ఆ దంపతులకు స్వంత పిల్లలు లేరు కానీ ,ఆ జంట యశ్వంతరావు అనే,బ్రాహ్మణ వితంతువు కుమారుని దత్తత తీసుకున్నారు. సావిత్రి బాయి జ్యోతీరావు పూలె ప్రోత్సాహలతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది.

సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. 1848 లోనే దేశంలొ విద్యా ఉద్యమం ప్రారంభించిన మొదటి మహిళ ఉపాధ్యాయురాలు, దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారం భించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే, వారి జీవిత కాలంలో మొత్తం,52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక అపవాదులను, అవమానాలను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలోనే 1849 లో పూలే, సావిత్రిబాయి దంపతులను గృహ బహిష్కారానికి గురిచేశాడు. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు గోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషి చేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలి సారిగా నినదించినది సానిత్రి బాయి పూలే, అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెన మెట్ల కుల వ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో 'సత్యాన్ని' శోధించడానికి 1873లో తన భర్త మహత్మా పూలేతో కలసి 'సత్య శోధక్ సమాజ్ ' ను ప్రారంభించి బాల్య వివాహలు, మూఢ నమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతి రేఖంగా మరియు వితంతువు పునఃర్వివాహల కొరకు అసమాన బ్రాహ్మనిజ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు.



గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దే వదిలేసి పోయిన ఓబిడ్డ ను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు క్షురకులను చైతన్య పర్చి, వితంతువులకు శిరోముల దనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయిం చారు సావిత్రీబాయి తరువాత 1873 సెప్టెంబరు 24న 'సత్యసోధక్ సమాజ్' అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యసోధన కోసం ఉద్యమాన్ని నడిపారు పూలే ఈసత్యసోధక్ సమాజ్ మహిళ విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోదక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రీబాయి అంట రానితనానికి వ్యతిరేకంగా పోరాదారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువువాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చునున్నారు. తమ పాటశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించివారు. సావిత్రి బాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితాసంపుటి ' కావ్యపూలే' ను ప్రచురించింది. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నా కర'ను 1891లో ప్రచురించింది. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి. జ్యోతీరావుపూలే, 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. దుఃఖంలో నుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్నయంగా నిప్పు పెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. పూలే మరణాంతరం సత్య సోలాక్ సమాజ్ భాధ్యతని స్వీకరించి నడిపించింది 1897 లో ప్లేగు వ్యాధి. పూణేనగరాన్ని వణికించింది. నగరమంతా ఏడాదిగా మారింది. జనమంగా దగ్గర్లోని బడవుల్లోకి పారి పోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కచ్చి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు.

ప్లేగు వ్యాధి సోడిన మాంగ్ లాంటి దళిత కులాలకి చెందిన చలిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897లో కబలించింది. ఆమె దత్తపుత్రుడు చకంగ్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా అధికారికంగా జరుపు తున్నారు.




" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# రఘునందన్ స్పెషల్ ఆపరేషన్ నల్గొండ ఆల గడపలో ముమ్మర తనిఖీలు




"వడ్లు ఎక్కడినుంచి వస్తున్నాయ్.." "డాక్యుమెంట్స్ ఏవీ" అంటూ ధాన్యం రవాణా చేస్తున్న లారీ డ్రైవర్ ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్. నల్గొండ జిల్లా మిరియాల గూడ ఆల గడప చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం ఉదయం పోలీసుల తో కలసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అంతర్రాష్ట్ర ధాన్యం లారీలను తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ ప్రారంభమై వడ్లు మిల్లులకు రవాణా అవుతున్న సందర్భంగా..ఆంధ్ర నుంచి ధాన్యం లారీలు తెలంగాణ లోకి రాకుండా ప్రత్యేక బృందాలు గా ఏర్పడి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ధాన్యం ఎక్కడినుంచి వస్తోంది. ఏ మిల్లులు వెళ్తోంది. రైతు పేరు వంటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్, ఆర్ సైదులు తదితరులు పాల్గొన్నారు. ఈ తనిఖీల తో..నల్గొండ లో ఉన్న రైస్ మిల్లుల కు ఇతర జిల్లాల నుంచి గానీ..పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ధాన్యం దొంగ చాటుగా తీసుకురావడం కుదరదు. అంతే గాక ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా కు కూడా చెక్ పడే అవకాశం ఉందని మాచన రఘునందన్ ఆశా భావం వ్యక్తం చేశారు

# ప్రపంచ హోమియో దినోత్సవం ఘనంగా నిర్వహణ



**నవతరం-శ్రీకాకుళం**

- హనీమన్ జయంతి వేడుకలు
- హోమియో వైద్యం ప్రాధాన్యం వివరణ
- జిల్లాలో 16 కేంద్రాల్లో సేవలు
- ప్రజలకు వినియోగించుకోవాలని పిలుపు

ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం హోమియో వైద్యశాల, పొన్నాడ హోమియో ఆసుపత్రిలో హోమియో పితామహుడు డాక్టర్ సామ్యూల్ హనీమన్ 271వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఉత్తమ్ రాజ్ రాణా ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో వైద్యం ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా దీర్ఘకాలిక వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 16 హోమియో కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

# అచ్చెన్నపై పేరాడ తిలక్ తీవ్ర విమర్శలు

- జగన్‌పై వ్యాఖ్యలపై ఆగ్రహం
- మంత్రిని కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్
- రాజకీయాలు భ్రష్టుపడుతున్నాయని ఆరోపణ
- శ్రీకాకుళం వైసిపి నేతల స్పందన



**నవతరం-శ్రీకాకుళం**

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై వైసిపి నేత పేరాడ తిలక్ తీవ్రంగా స్పందించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఆయన అన్నారు. అచ్చెన్నాయుడు రాజకీయ ప్రయోజనాల కోసం అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మంత్రివర్గంలో కొనసాగడానికి అనర్హుడని, ఆయనను కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# ఉపాధి పనుల్లో ఫేస్ యాప్ రద్దు చేయాలి

- హాజరు సమస్యలతో కూలీల ఇబ్బందులు
- గిరిజన ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం
- 200 రోజుల పని, రూ.600 కూలి డిమాండ్
- గుళుమూరులో కార్మికుల సమావేశం

**నవతరం-హిరమండలం**

ఉపాధి హామీ పనుల్లో అమలు చేస్తున్న ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. గుళుమూరు గ్రామంలో కూలీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.
ఫేస్ యాప్ కారణంగా పని చేసిన వారికీ హాజరు నమోదు కాక కూలి అందక ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు.
సంవత్సరానికి 200 పని దినాలు, రోజుకు



రూ.600 కూలి, పాత విధానాల పునరుద్ధరణతో పాటు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

# విప్లవ సాంస్కృతిక ధ్రువతార కానూరికి నివాళులు

- చిన్ననీలావతిలో వర్ధంతి నిర్వహణ
- చిత్రపటానికి పూలమాలలు, మౌనం
- ప్రజాకళకు అంకితమైన జీవితం
- కళాకారులు ప్రజల పక్షాన ఉండాలని పిలుపు

**నవతరం-పలాస**

విప్లవ సాంస్కృతిక ఉద్యమ ధ్రువతార కామ్రేడ్ కానూరు వెంకటేశ్వరరావు 11వ వర్ధంతి సందర్భంగా పలాస మండలం చిన్ననీలావతిలో నివాళులు అర్పించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా స్మరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కానూరు తన జీవితాన్ని కళారంగానికి అంకితం చేసి, ప్రజల కోసం పోరాడిన మహోన్నత కళాకారుడని కొనియాడారు. ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన ఆయన విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి దిక్సూచి అని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ



కళాకారులు ప్రజల పక్షాన నిలబడి సామాజిక సమస్యలపై స్పందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహణ

**నవతరం-జలుమూరు**

నేడు జలుమూరు మండలం, యలమంచిలి గ్రామంలో Z.P హైస్కూల్ నందు టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం వారు అవేర్నెస్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఈ ప్రోగ్రాం ముఖ్యంగా బాల బాలికలు వారి యొక్క స్వీయ రక్షణ నిమిత్తము, ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు వారికి సహాయంగా పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్ గూర్చి, మరియు నేషనల్ హైవే మరియు రూరల్ రోడ్లపై ప్రయాణించిన ప్రతి ఒక్కరూ విధిగా పాటించవలసిన మెలుకువలను తెలిపారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్లు ధరించాలని, విధిగా లైసెన్స్ తీసుకోవాలని, మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం, అని ప్రమాదాలు ఎవ్వరికి చెప్పి రావు గనక, మద్యం సేవించి వాహనం నడుపుట ప్రమాదమని, హెల్మెట్లు ధరించడం వలన ఉపయోగాలు గూర్చి వివరించారు. ఈ ఎవేర్నెస్ ప్రోగ్రాంలో నేషనల్ హైవే హెల్ప్ లైన్ నెంబర్ 1033, మరియు పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్ 181, 112, 1091, యొక్క వినియోగం గూర్చి, వేధింపులు గృహహింస, పిఓ సిఎస్ఓ కేసులు గూర్చి అంతేకాకుండా సైబర్ మోసానికి గురైనట్లయితే , మారకద్రవ్యాలు సరఫరా వినియోగం కోసం




(యాంటీ డ్రగ్స్) మరియు, బాల్య వివాహాలు ,బాల కార్మికుల కొరకు విద్యార్థులకు విపులముగా తెలియపరచారు, ఈ కార్యక్రమం లో టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం గిరిధర్, కోటబొమ్మాళి హెడ్ కానిస్టేబుల్, ఆ.శ్రీనివాస్ రావు, వుమెన్ కానిస్టేబుల్ కె.చామంతి,ఊా హైస్కూల్ హెడ్ మాస్టారు రఘునాథరావు , పాఠశాల బాలబాలికలు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బధిర క్రికెట్ క్రీడాకారిణి గొగ్గి రోహిణికి ఘన సన్మానం

**నవతరం-టెక్కలి**

మండలంలోని పెద్దసాన గ్రామానికి చెందిన బధిర క్రికెట్ క్రీడాకారిణి గొగ్గి రోహిణికి బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. హర్యానాలో గత నెల 23 నుంచి 27 వరకు జరిగిన జాతీయ స్థాయి డెఫ్ టీ10 క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన రాష్ట్ర జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా టెక్కలి బీజేపీ నాయకులు, గ్రామస్థులు ఆమె ప్రతిభను కొనియాడుతూ, శాలువా కప్పి సత్కరించారు. ఈ



సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గొగ్గి రోహిణి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**